క్లుప్తంగా

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



గట్టు: మండల కేంద్రంలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారరం నిర్వహించిన పరీక్షకు 378 మందికి గాను, 371 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి, డిపార్టుమెంటల్ అధికారి కృష్ణవర్ధన్‌రెడ్డిలు తెలిపారు. పరీక్ష కేంద్రం బయట పోలీస్ బందోబస్తు నిర్వహించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే పరీక్ష కేంద్రంలోకి అనుమతించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



రాజోళి: మండల కేంద్రంలో భ్రమరాంబ అడివేశ్వర స్వామి జాతరను పురస్కరించుకుని సోమవారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ శ్రీరామ్‌రెడ్డి జ్ఞాపకరార్థం ఆయన సతీమణి సంధ్య పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ఆటలు ఆడటం వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందని, మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో ఆటలు బాగం కావాలని, అప్పుడే ఆరోగ్యం మన చేతుల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గంగి రెడ్డి, సోమశేఖర్, జైరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



అయిజ: మండల కేంద్రంలోని తిక్క వీరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు ఆట, పాటలతో అలరించారు. ఉత్సవాల సందర్భంగా సోమవారం ఆలయంలో అర్చకులు తిక్క వీరేశ్వర స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

భవన నిర్మాణ కార్మికులు పోరాటం చేయాలి



రాజోళి: కార్మిక చట్టాలను కాపాడుకునేందుకు ప్రతి కార్మికుడు పోరాటం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఆర్‌డీటీ కాలనీలో భవన నిర్మాణ రంగ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్మికుల హక్కులను కాలరాసే ప్రభుత్వాలపై ప్రతి కార్మికుడు పోరాటం చేయాలన్నారు. నూతన కమిటీలో భాగంగా గౌరవ మండల అధ్యక్షుడిగా విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడిగా అడివన్న, ప్రధాన కార్యదర్శిగా పురుషోత్తం, కోశాధికారిగా దావీదు, ఉపాధ్యక్షులుగా రాజు, రాజేష్, సహాయ కార్యదర్శులుగా రాము, దానమయ్య సభ్యులుగా యేసన్న, దాము, దేవరాజు, ఆనంద్, విజయ్‌లను ఎన్నుకున్నారు.

మార్మోగిన శివనామస్మరణ



రాజోళి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి శివ మాలదారులు సోమవారం శ్రీశైలానికి బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శివనామస్మరణ మార్మోగింది. ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు చేసిన అనంతరం ఇరుముడి కట్టుకున్నారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో భజనలు, పాటలు పాడుకుంటూ పురవీధుల గుండా పొలిమేరదాకా వెళ్లి మాలదారులను సాగనంపారు.

శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివునికి అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో శివాలయాన్ని దర్శించుకున్నారు.

ఏళ్లు గడిచినా మరమ్మతులేవి?

- శిథిలావస్థలో చెక్‌డ్యాంలు
- మట్టిదిబ్బలు పిచ్చిమొక్కలతో దర్శనం
- వృథా అవుతున్న వరదనీరు
- పట్టించుకోని అధికారులు



వరదలకు కొట్టుకుపోయిన చెక్‌డ్యాం



మరమ్మతులకు నోచుకోని చెక్‌డ్యాం

కేటీదొడ్డి: నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా వర్షపు నీరు వృథా కాకుండా, భూగర్భ జలాలు పెంపొందించాలనే ఉద్దేశ్యంతో గ్రామాల్లో చెక్‌డ్యాంలు నిర్మించారు. వాటర్ షెడ్, ఇరిగేషన్‌తో పాటు ఉపాధిహామీ నిధులతో వీటిని ఏర్పాటు చేశారు. కేటీదొడ్డి మండలంలోని చెక్‌డ్యాంలకు కొన్నేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో కాల్వలు ధ్వంసమై వర్షపు నీరు నిలవడంలేదు.

వృథాగా వరద నీరు..

మండల కేంద్రమైన కేటీదొడ్డితో పాటు అన్ని గ్రామాల్లో చెక్‌డ్యాంలు నిర్మించారు. మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల చెక్‌డ్యాంలు ధ్వంసమై వరద దాటికి కొట్టుకుపోయాయి. నేటికీ మరమ్మతులు చేపట్టలేదని రైతులు వాపోతున్నారు. కాలూర్ తిమ్మన్‌దొడ్డి శివారులో చెక్‌డ్యాం కొన్నేళ్ల క్రితం కురిసిన వర్షాలకు తెగిపోయింది. నిర్మాణం సమయంలో నాణ్యత పాటించకపోవడంతో దెబ్బతిన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. చాలాచోట్ల పూడికతీత పనులు చేపట్టకపోవటంతో మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. పై నుంచి వచ్చిన నీరు పక్కనున్న పంట పొలాల్లోకి చేరి పంటలకు నష్టం ఏర్పడుతోందని రైతులు చెబుతున్నారు. పర్యవేక్షణ కొరవడి చెక్‌డ్యాంలు గట్లపై కాల్వ మధ్య పిచ్చిమొక్కలు పెరిగాయి. చాలా చోట్ల బీటలు వారి, అవి కూడా తెగిపోయే ప్రమాదం ఉంది. ఈ విషయం సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

పూడిక తీయించాలి..



మండలంలోని కేటీదొడ్డి శివారులో ఉన్న చెక్‌డ్యాంలో మట్టి దిబ్బలు పేరుకుపోయి పిచ్చి మొక్కలతో నిండిపోయింది. వాటిలో నీరు నిలిపితే భూగర్భ జలాలు పెరుగుతాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూడిక తీయించాలి.

– చిన్న రాములుగౌడు, రైతు, కేటీదొడ్డి

ప్రతిపాదనలు పంపిస్తాం

చెక్‌డ్యాంలు మరమ్మతుల విషయం మా దృష్టికి రాలేదు. వాటిని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే మరమ్మతులు చేయిస్తాం.

– లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ ఏఈ

ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

- రాష్ట్ర వైద్య బృందం సభ్యుడు నర్సింహారెడ్డి



మల్దకల్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య బృందం సభ్యులు

మల్దకల్: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య మరింత పెంచాలని రాష్ట్ర వైద్య బృందం సభ్యులు నర్సింహారెడ్డి, రామాంజనేయులు వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో వారు మాట్లాడారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు నెలనెలా వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు, ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు వారు అమరవాయి, మల్దకల్ గ్రామాలలో పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి వారికి చుక్కల మందు వేసే కార్యక్రమాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ స్వరూపారాణి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు పెంచాలి



జెడ్పీచైర్‌పర్సన్ సరితతో మాట్లాడుతున్న బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు

గద్వాల రూరల్: ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో జిల్లాకు అతితక్కువ పోస్టులు కేటాయించి నిరుద్యోగులకు తీరని అన్యాయం చేసిందని బీఎడ్, డీఎడ్ అభ్యర్థులు తెలిపారు. సోమవారం వారు జెడ్పీచైర్‌పర్సన్ సరిత, డీఈఓను కలిసి వినతిపత్రం ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలో 760 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతుంటే ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో మాత్రం కేవలం 172పోస్టులే ప్రకటించడం అన్యాయమన్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి జిల్లాకు ఎక్కువ పోస్టులు ఇప్పించాలని జెడ్పీచైర్‌పర్సన్ సరితను కోరారు.

ధరణి దరఖాస్తుల పరిశీలన

కేటీదొడ్డి: ధరణి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు సమాయత్తం అవుతున్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలోని తహసీల్దార్ మహమ్మద్ షాహేదా బేగం సిబ్బంది విధులకు పూర్తి స్థాయిలో హాజరయ్యారు. ఈ సందర్భందగా రెవెన్యూ గ్రామాల పరిధిలోని ధరణి పోర్టల్ కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు పరిశీలించారు. దరఖాస్తులను క్షుణ్ణగా పరిశీలించాలని, సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందిని తహసీల్దార్ మహమ్మద్ షాహేదాబేగం ఆదేశించారు. కార్యక్రమంలో నాయబ్‌తహసీల్దార్ శివశంకర్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్ఐ దేవేందర్ రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పశుసంపద కోసం వైద్య సేవలు



కొంకలలో ఎద్దుకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది



బింగుదొడ్డిలో..

శాంతినగర్: ఆరోగ్యవంతమైన పశుసంపద పెంచడం కోసం వైద్య సిబ్బంది కృషి చేస్తోందని శాంతినగర్ పశుసంవర్ధకశాఖ డాక్టర్ పుష్పలత అన్నారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో మూడు రోజులపాటు టీకాలు వేశామని, చివరి రోజు 24 మంది రైతులకు చెందిన 274 పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. రైతులు పొలాలు, పంటల సాగుతోపాటు పశు సంపదను పెంచుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రకృతి సహకరించక పంటలు దిగుబడి లేక నష్టపోయిన పశువుల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వీఎల్‌ఓ వరప్రసాద్, ఎల్ఎస్‌ఏ లతీఫ్, గోపాలమిత్ర లక్ష్మన్నలు పాల్గొన్నారు.

నేడు వెంకట్రామనగర్‌లో..

వడ్డేపల్లి మండలంలోని వెంకట్రామనగర్ (26వ కాల్వ) లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు డాక్టర్ పుష్పలత పేర్కొన్నారు. రైతులు, పశు పోషకులు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పశువులకు వేయించాలని సూచించారు.

రోగనిరోధక టీకాలు వేయించండి

అయిజ: పశువుల్లో థైలెరియోసిస్ రాకుండా వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రోగనిరోధక టీకాలు వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి కోరారు. మండలంలోని బింగుదొడ్డిలో పశువులకు వెటర్నరీ సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడారు. మొత్తం 63 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి అనుమానాలున్నా పశువుల ఆస్పత్రిలో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఈసీ

మల్దకల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని డీఈసీ సభ్యులు హృదయరాజు, పద్మావతిలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. మొత్తం115 మంది విద్యార్థులకు 111 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ నర్సింహులు, డిపార్ట్‌మెంటల్ అధికారి సత్యనారాయణ తెలిపారు.

ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయాలి

అయిజ: పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా మానిటరింగ్ ఆఫీసర్ రాజు సోమవారం మండలంలోని ఉప్పల, బింగుదొడ్డి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలియోను తరిమికొట్టాలంటే చిన్నారులకు తప్పని సరిగా పోలియో చుక్కలు వేయాలన్నారు. సోమ, మంగళ వారాల్లో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయించుకోని చిన్నారులను గుర్తించి, పోలియో చుక్కలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్‌లు శ్యామ్ సుందర్, ముక్బుల్, ఏఎస్‌ఎం దానమ్మ, శ్యామల, వజ్రలీల, పుష్ప, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లు షురూ



రాజోళి: మండల కేంద్రంలో కొలువైన భ్రమరాంబ అడివేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఈ నెల 11 నుంచి ప్రారంభం కానున్నాయి. జాతరను పురష్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాలతో పాటుగా, రాయలసీమ, కర్ణాటక నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. వారితో పాటుగా జాతరలో పెద్ద ఎత్తున వ్యాపార దుకాణాలు వెలుస్తాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు ఆలయం ముందు భాగంలో ఖాళీ ప్రదేశాన్ని చదును చేసే పనులు మొదలుపెట్టారు. వ్యాపార దుకాణాలు వేసుకునేందుకు వీలుగా స్థలాన్ని చదును చేయడంతో పాటు, పిచ్చి మొక్కలు ముళ్ల చెట్లను తొలగించారు.

రోడ్డుకు మోక్షమెప్పుడో?



శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నె బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. శాంతినగర్ నుంచి కోయిల్‌దిన్నె వరకు గతంలో నిర్మించిన 4 కిలోమీటర్ల రహదారి వాహనదారులకు నరకాన్ని చూపుతోంది. ఈ రోడ్డుకు ఎప్పుడు మోక్షం లభిస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. రహదారి గుండా నిత్యం వల్లూరు–నేషనల్ హైవే 44కు వందలాది వాహనాలు వెళ్తుంటాయి. రోడ్డు బాగలేకపోవడంతో వాహనాలు మరమ్మతులకు గురవడం, ఢీకొనడం, అదుపుతప్పి కింద పడటం నిత్య కృత్యమైంది. ఈ విషయమై ఆయా గ్రామాల ప్రజలు ప్రజాప్రతినిధులు, అధికారులతో మొరపెట్టుకున్నా పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయితీరాజ్‌శాఖ అధికారులు స్పందించి కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి



ఎన్నికైన ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ

రాజోళి: పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని, లేకపోతే వారి తరఫున ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో సోమవారం జరిగిన మండల కమిటీ ఎన్నికకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా, ప్రజలకు అందుబాటులో ఉండే కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. మాదిగల్లో కులవృత్తిని నమ్ముకున్న వారికి పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడిగా భాస్కర్, ఉపాధ్యక్షుడిగా ఆర్.అనిల్, ప్రధాన కార్యదర్శిగా బీసన్న, పురుషోత్తం, అశోక్, కిషోర్, శేషన్నలను ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శిగా దేవన్న, అలంపూర్ నియోజకవర్గ కన్వీనర్‌గా నవీన్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమదాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్, జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు నిషాక్, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థులకు రాగిజావ అందించలేం



డీఈఓ కార్యాలయంలో వినతి పత్రం అంజేస్తున్న వంట ఏజెన్సీ సంఘం నాయకులు


గట్టు: గత ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారంగా అందించే రాగి జావను కొనసాగించలేమని, బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నట్లు వంట ఏజెన్సీ నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం, డీఈఓ కార్యాలయంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు వినతి పత్రాలను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు శేషన్న, ఉపాధ్యక్షురాలు సోమేశ్వరమ్మ, సంఘం నాయకులు శివశంకర్, తిప్పన్న, సుజాత, పార్వతమ్మ తదితరులు కలెక్టర్, డీఈఓ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. ఆరు నెలలుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం పూట రాగి జావను అల్పాహారంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ వరకు ఎలాంటి బిల్లులు అందలేదని వాపోయారు. మధ్యాహ్న భోజనం బిల్లులు కూడా నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. బకాయిలు వెంటనే చెల్లించే విధంగా ఏర్పాట్లు చేయాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.

ఒకే వ్యక్తికి మూడు ఉద్యోగాలు



అయిజ: మండల కేంద్రానికి చెందిన కుర్వ పల్లయ్య గురుకుల విద్యాసంస్థలు నిర్వహించిన పరీక్షల్లో మూడు ఉద్యోగాలు సాధించాడు. టీజీటీ, పీజీటీ, జూనియర్ అధ్యాపక ఉద్యోగం సాధించాడు. పల్లయ్య ప్రస్తుతం అలంపూర్ కోర్టులో ప్రాసెస్ సర్వర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటి వద్దనే ప్రిపేర్ అవుతూ ఏకంగా మూడు ఉద్యోగాలు సాధించి పలువురి ప్రశంసలు పొందాడు.

ఒకేసారి రెండు..



మండలంలోని బింగుదొడ్డికి చెందిన నర్మద ఏకకాలంలో రెండు ఉద్యోగాలను సంపాదించింది. ఫిబ్రవరి 14న వెలువడిన గురుకులం పీజీటీ ఫలితాల్లో నర్మద ఎంపికైంది. అదే విధంగా ఫిబ్రవరి 29న వెలువడిన జేఎల్ ఫలితాల్లో సైతం ఉద్యోగం వరించింది. ఏక కాలంలో రెండు ఉద్యోగాలు సాధించిన నర్మదను సోమవారం పలువురు ప్రముఖులు ప్రశంసించారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



సాసనూలు దగ్గర గుంతలు పడి కూలిపోయిన కల్వర్టు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారులపై గతంలో నిర్మించిన కల్వర్టులు వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా ఎర్రవల్లిచౌరస్తా నుంచి రాజశ్రీ గార్లపాడు వెళ్లే రోడ్డుపై పలు కల్వర్టులు వర్షాల కారణంగా కూలిపోయి ఏండ్లు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.ఈ దారి గుండా పదుల సంఖ్యలో గ్రామాలతో పాటు వివిధ మండలాలు ఉండటంతో రోడ్డు ప్రతిరోజు రద్దీగా ఉండటంతో వాహనదారులు కల్వర్టులపై ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా ఆర్ గార్లపాడు, సాసనూలు, షేకుపల్లి గ్రామాల సమీపంలోని కల్వర్టులు కూలిపోయిన ప్రదేశంలో ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలిపోయిన కల్వర్టులకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మొక్కలు ఎండుతున్నా పట్టింపేది?



నీరులేక ఎండిపోయిన మొక్కలు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నె సమీపంలోని పల్లె ప్రకృతి వనంలోని మొక్కలు ఎండుతున్నా ఎవరికీ పట్టడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెలు పచ్చదనంతో కళకళలాడాలనే సంకల్పంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కలకు నీరందక ఎండిపోతున్నాయని వాపోతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేకాధికారి స్పందించి మొక్కలు నీరు పోయించి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బస్సు షెల్టర్లు లేక ప్రయాణికుల పాట్లు



మల్దకల్‌లో బస్సు కోసం రోడ్డుపై నిరీక్షిస్తున్న ప్రయాణికులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల స్టేజీల వద్ద బస్సుషెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ అధికారులు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడంలో విఫలమైనట్లు ఆరోపణలున్నాయి. ఎండాకాలంలో ఎండలకు, వర్షకాలంలో వర్షాలకు తడుస్తూ ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనం. గద్వాల–అయిజ ప్రధాన రహదారిలో మల్దకల్ మండలంలోని పెద్దపల్లి, బూడిదపాడు, అమరవాయి, మల్దకల్, శేషంపల్లి, తాటికుంట స్టేజీల వద్ద నిత్యం ప్రయాణికులు వందల సంఖ్యలో వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ధరూరు మండలంలోని వివిధ స్టేజీల వద్ద, గట్టు , కేటీదొడ్డి, గద్వా ల మండలాల్లోని వివిధ స్టేజీల వద్ద బస్సు షెల్టర్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం బస్సు షెల్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మల్దకల్‌లో 12వేలకు పైగా జనాభా ఉండటంతో పాటు జోగుళాంబ గద్వాల జిల్లాలోనే ప్రముఖ క్షేత్రంగా ఉన్న మల్దకల్ తిమ్మప్పస్వామిని దర్శించుకునేందుకు భక్తులు వందల సంఖ్యలో వస్తుంటారు. ఈ విషయమై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా స్టేజీల వద్ద బస్సు షెల్టర్ల నిర్మాణం చేపట్టి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక రోడ్డుపై ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉంది. బస్సు షెల్టరు లేకపోవడంతో ఎండలో నిలిచి ఉంటున్నాం. బస్సు వచ్చే వరకు ఇ బ్బందులు తప్పడం లేదు. అధికారులు బస్సు షెల్టరు నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

– తిమ్మన్న, అమరవాయి

బస్సు షెల్టర్‌ను నిర్మించాలి



మండల కేంద్రంతో పాటు మల్దకల్‌లో బస్టాండు నిర్మాణం చేపట్టాలి. ప్రతి శనివారం వందలాది మంది భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్య లో ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి బస్సు షెల్టరు నిర్మించాలి.

– రామంజనేయులు, మల్దకల్

చర్యలు తీసుకుంటాం..



నియోజకరవర్గంలోని ఆయా స్టేజీల వద్ద బస్సు షెల్టర్ల నిర్మాణం కోసం ప్రయాణికుల వినతి మే రకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. అధికారుల సూచన మేరకు ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

– మంజుల, గద్వాల డిపో మేనేజర్